
నమస్కారం ఎమ్మెల్యేగారూ..!


అసెంబ్లీ అన్నాక.. ఇలా గోల కూడా ఉండాల్సిందే కదా..

అ ధ్యక్షా..! దరగొట్టేశారు..!

సమస్యలపై నిలదీసిన ప్రతిపక్షం
దీటుగా బదులిచ్చిన అధికారపక్షం
స్టూడెంట్ అసెంబ్లీలో జీవించిన విద్యార్థులు

బడి పిల్లలు బాధ్యతగల ఎమ్మెల్యేలు అయ్యారు..! అసెంబ్లీ వేదికగా అధికార, ప్రతిపక్ష సభ్యులుగా విడిపోయారు. స్పీకర్‌ను ఎన్నుకున్నారు..! ఇక సభ మొదలైంది. ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గట్టిగా నిలదీశారు. నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వారికి పాలక పక్షం ఎమ్మెల్యేలు దీటుగా ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై మంత్రులు స్పందించారు. తమ తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించారు. 'రాజకీయం చేయొద్దు..' అని ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు హితవు పలికారు. అసెంబ్లీ ఎలా జరిగితే జనం హర్షిస్తారో.. ఎలా జరగాలని జనం కోరుకుంటారో.. చేసి చూపించారు. ఇది స్టూడెంట్ అసెంబ్లీనా..? అసలైన అసెంబ్లీనా..? అని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సహా.. అందరూ కళ్లప్పగించి చూసేలా.. జీవించారు. మొత్తంగా.. అసెంబ్లీని అదరగొట్టేశారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో బుధవారం నిర్వహించిన 'స్టూడెంట్ అసెంబ్లీ'లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల్లో కొందరికే మాట్లాడే అవకాశం వచ్చింది. సమయాభావం వల్ల మిగిలినవారికి అవకాశం రాకపోయినా, అసెంబ్లీలో తమ వంతు పాత్రను పోషించారు. మరపురాని జ్ఞాపకాలను మూటగట్టుకున్నారు.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అనంతపురం

చెట్లెక్కడ నాటేది...?

'అధ్యక్షా..! చెట్లు నాటాలి.. చెట్లు నాటాలి అని మంత్రి అంటున్నారు. ప్రతి విద్యార్థీ ఒక మొక్కను నాటాలని చెబుతున్నారు. మంత్రిగారు చెబుతున్న మాటలు పేపర్లలో పచ్చగా బాగా కనిపిస్తున్నాయి. నగరాలు, పట్టణాలలో ఉండే పాఠశాలలలో క్రీడా మైదానాలు లేవు. ఇక మొక్కలను ఎక్కడ నాటేది..? పాఠశాలలో విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవు. తాగడానికి నీరు లేవు. ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ఇక చెట్లకు నీరు ఎక్కడి నుంచి తెచ్చి పోస్తారు..?'


అసెంబ్లీ ఆవరణలో అనంత ఎమ్మెల్యేలు



అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రిపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే తలారి అభిజ్ఞ ఇలా విరుచుకుపడింది. అసలు సిసలు విపక్ష ఎమ్మెల్యేలా గళం విప్పి.. అబ్బురపరిచింది. కళ్యాణదుర్గం వాల్మీకి సర్కిల్‌లో ఉండే తలారి రమేష్, చంద్రకళ దంపతుల కూతురు అభిజ్ఞ.. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. స్టూడెంట్ అసెంబ్లీలో మాట్లాడేందుకు వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంది.

(వివరాలు 6వ పేజీలో..)

ఇది నా అదృష్టం..



అసెంబ్లీ సమావేశాలను టీవీలో అప్పుడప్పుడు చూసేవాళ్లం. ఇప్పుడు అదే అసెంబ్లీలో ఓ ఎమ్మెల్యేగా అధికార పార్టీ తరఫున కూర్చొనే అవకాశం దక్కింది. అసెంబ్లీ అంటే ఎలా ఉంటుంది, సీఎం, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ఎలా మాట్లాడుతారు, ఎలా నిర్ణయాలు తీసుకుంటారు అని కళ్లారా చూశాం. అందులో నేను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో మరపురాని ఘట్టం ఇది. ప్రభుత్వం, విద్యాశాఖకు రుణపడి ఉంటాను.

-సదాఫ్ నాజ్, అనంతపురం అర్బన్ స్టూడెంట్ ఎమ్మెల్యే

నేను మంత్రినయ్యా..



స్టూడెంట్ అసెంబ్లీకి రాప్తాడు ఎమ్మెల్యేగా ఎంపికయ్యాను. అసెంబ్లీలో అధికార పార్టీ తరఫున పరిశ్రమల శాఖ మంత్రిగా అవకాశం దక్కింది. మంత్రి హోదాలో సమావేశంలో పాల్గొనడం చాలా సంతోషం కలిగింది. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాయో తెలుసుకున్నాను. జీరో అవర్, క్వశ్చన్ అవర్ అంటే ఏమిటో స్పష్టంగా తెలిసింది. ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీకి వెళ్లాలని ఎంతోమంది చూస్తుంటారు. కానీ చిన్న వయసులోనే నాకు అసెంబ్లీలో పాల్గొనే అవకాశం దక్కింది. ప్రభుత్వానికి, విద్యాశాఖకు కృతజ్ఞతలు.

- శ్యామ్ శ్రీనాథ్ రెడ్డి, ఏపీ మోడల్ స్కూల్, రాప్తాడు

దిక్కులేని రోగులు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత


ఓపీలో డాక్టర్లను కలిసేందుకు రోగుల కష్టాలు, మూసివేసిన రేడియాలజీ విభాగం

- 68పోస్టులకు 37 ఖాళీ
- 17విభాగాలకు నలుగురే ప్రొఫెసర్లు
- ఓపీ సేవలకే అలసిపోతున్న డాక్టర్లు
- మధ్యాహ్నం దాటితే ఒక్క వైద్యుడు ఉండరు
- ఐపీ, ఐసీయూల్లో రోగులకు దేవుడే దిక్కు



అనంతపురం వైద్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్యుల కొరతతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోగులు విలవిల్లాడుతున్నారు. ఆస్పత్రి ప్రారంభమై ఐదేళ్లు గడిచినా నేటికీ పూర్తి స్థాయిలో వైద్యులను నియమించలేదు. ఆస్పత్రిలో 17 విభాగాలకు 68 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 31మంది మాత్రమే ఉన్నారు. ఉన్నవారు పని ఒత్తిడితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రంలో రూ.200కోట్లు వ్యయం చేసి అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో వైద్యులు లేకుండానే కొవిడ్ విజృంభిస్తున్న తరుణంలో ప్రారంభించారు. తర్వాత కూడా పూర్తిస్థాయిలో డాక్టర్లను నియమించలేదు. ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కమిషన్) నిబంధనల మేరకు ప్రతి విభాగానికి కనీసం ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ఆప్రకారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని 17 విభాగాలకు 68మంది డాక్టర్లను నియమించాలి. అయితే 31మంది డాక్టర్లను మాత్రమే నియమించడంతో 37 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఉన్నవారిలో నలుగురు ప్రొఫెసర్లు, తొమ్మిది మంది అసోసియేట్, 18మంది అసిస్టెంట్స్ మాత్రమే ఉన్నారు. వీరంతా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఓపీలలో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. మధ్యాహ్నం అయితే దాదాపు డాక్టర్లందరూ వెళ్లిపోతున్నారు. దీంతో ఇన్‌పేషెంట్(ఐపీ), ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లలో అడ్మిట్ అయిన రోగులకు దేవుడే దిక్కులా మారింది.

మధ్యాహ్నం దాటితే...

ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అనస్తీషియా, కార్డియాలజీ, ఎండో క్రైనాలజీ, మెడికల్ (మిగతా 6లో..)

భారత రాజ్యాంగం మహోన్నతమైనది: కలెక్టర్


అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగం భారత్‌దేనని కలెక్టర్ ఆనంద్ అన్నారు. రాజ్యాంగం స్ఫూర్తిగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్, డీఆర్ఓ మలోల తదితరులు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక మేరకు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగం స్ఫూర్తిగా ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ఉండాలనీ, పేద ప్రజల అభ్యున్నతి, వారి సంక్షేమం, అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలన్నారు.

ఆదర్శ గ్రామాల్లో పనులు వేగవంతం చేయండి

జిల్లాలో ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామీణ యోజన కింద ఎంపికైన గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామీణ యోజన అమలుపై స్థానిక కలెక్టరేట్‌లో ఆయన బుధవారం సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... మురుగు కాలువలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పూర్తయిన పనులకు త్వరగా బిల్లులయ్యేలా చొరవ చూపాలన్నారు. రెండో దశలో జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి కణేకల్లు మండలంలోని గరుడచేడు పంచాయతీలోని మీనహళ్లి, పెద్దవడుగూరు మండలంలోని పెనకలపాడు పంచాయతీ కొండూరు గ్రామం ఎంపికయ్యాయనీ, ఆయా గ్రామాల్లో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలి

వామపక్ష నేతల డిమాండ్

అనంతలో ఆందోళన


ర్యాలీ చేస్తున్న వామపక్ష నేతలు, కార్మికులు

అనంతపురం విద్య, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. కొత్త లేబర్‌కోడ్స్‌ను నిరసిస్తూ నగరంలో వామపక్షాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. క్రిష్ణకళామందిరం నుంచి టవర్‌క్లాక్ మీదుగా ఎల్ఐసీ కార్యాలయం వరకు కార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అక్కడ కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. వామపక్ష నేతలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం.. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ.. కార్మికవర్గానికి ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనీ, లేదంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు రాజారెడ్డి, మల్లికార్జున, నాగేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, రాజేష్ గౌడ్, ఏసురత్నం, కృష్ణుడు, రాజు, లింగమయ్య, చెన్నప్ప, చంద్రశేఖర్, బాలరంగయ్య, శేఖర్, వెంకటనారాయణ, మనోహర్ పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకోండి

- ఎమ్మెల్యే బండారు శ్రావణి


ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అరటికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబును శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అభ్యర్థించారు. మంగళగిరిలో సీఎం చంద్రబాబును బుధవారం ఆమె కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది అరటిని సాగు చేశారని ధరలు లేక వారు తీవ్రంగా నష్టపోతున్నట్లు సీఎంకు వివరించారు. బుక్కరాయసముద్రం మండలంలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గార్లదిన్నె నుంచి మర్తాడు మీదగా కోటంక వరకు తారు రోడ్డుకు నిధులు ఇవ్వాలని కోరారు.

సోషలిస్టు పాలనతోనే దేశ పురోగతి

- ప్రజాహక్కులను నెరవేరిస్తేనే అభివృద్ధి
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

7



అరటి రైతును ఆదుకుంటాం: కలెక్టర్


అరటి గెలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నార్పల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అరటికి గిట్టు బాటు ధర లేక తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని గడ్డంనాగేపల్లి వద్ద అరటి తోటలను ఉద్యానశాఖ అధికారులు, రైతులతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. అరటికి గిట్టుబాటు ధర లేకపోవడానికి కారణాలను ఉద్యానశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహారాష్ట్రలో అరటి సాగు పెరిగిందని, విదేశాలకు అరటి ఎగుమతులు తగ్గడమే ఇందుకు కారణమని వారు వివరించారు. అనంతరం రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అరటి సాగుకు పెట్టుబడులు, నష్టంపై ఆరాతీశారు. జిల్లా అరటి రైతుల కష్టాలపై ప్రభుత్వానికి నివేదిక పంపి, ఆదుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ ధనుంజయ, హెచ్ఓ నెట్టికంటయ్య, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీనే కావాలి..!

డిప్యూటీ ఎంపీడీఓల మారాం.. ఉద్యోగోన్నతి వదులుకునేందుకూ సిద్ధం

ప్రమోషన్ అంటే ఏ ఉద్యోగి అయినా ఎగిరి గంతేస్తారు. సంబరాలు చేసుకుంటారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన, ఆ జాబితాలో ఉన్న సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి వస్తున్నా.. వారిలో ఆనందం లేదు. ప్రమోషన్ వచ్చినా.. పంచాయతీ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు చక్కబెడతామని కోరుతున్నారు. రాజకీయ నేతల ముందు ఈ మేరకు డిమాండ్లు ఉంచుతున్నారు. అవసరమైతే.. ప్రమోషన్ వదులుకుంటాం కానీ, పంచాయతీ మాత్రం కావాల్సిందేనన్నట్లుగా మారాం చేస్తున్నారు. వారి తీరుతో ఆ శాఖ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి.

ఇన్‌చార్జిలుగా ఉంటామంటూ నేతల వద్ద డిమాండ్లు

రూరల్-అర్బన్ పంచాయతీలపై కన్నేసిన వైనం



అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల రీ-గ్రేడింగ్‌లో భాగంగా క్లస్టర్ వ్యవస్థకు మంగళం పలికింది. దీంతోపాటు సిబ్బందిలో గ్రేడ్-6 వరకు ఉన్నవారిని గ్రేడ్-3 వరకే పరిమితం చేసింది. అదనంగా రూరల్-అర్బన్ పంచాయతీతోపాటు గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా రూపుదిద్దడానికి విధివిధానాలను ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టింది. రూరల్-అర్బన్ పంచాయతీల కింద జిల్లాలో 10 వేల మంది జనాభాగానీ, కోటి రూపాయల వార్షిక ఆదాయం గానీ ఉన్న పంచాయతీలను (మిగతా 6లో...)

కూలిన హెచ్చెల్సీ కల్వర్టు పిల్లర్ గోడ


హెచ్చెల్సీ కల్వర్టు పిల్లర్ గోడ కూలిపోయిన దృశ్యం

కణేకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీచిక్కణ్ణేశ్వర ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ కల్వర్టు కింది పిల్లర్‌గోడ నీటి ఉధృతికి బుధవారం ఉదయం పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ కోసం రూ.2 కోట్లు మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనులను చేయలేదు. కల్వర్టు గోడ కుంగిపోవడంతో కణేకల్లు నుంచి గంగలాపురం, రచ్చుమర్రితో పాటు వందలాది ఎకరాల ఆయకట్టు భూములకు దారి లేకుండా పోయింది. ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ షట్టర్లు ఎత్తడానికి, దించడానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి.

గిట్టుబాటు ధర కల్పిస్తాం

- ఎమ్మెల్యే పరిటాల సునీత


సబ్సిడీ గడ్డి విత్తనాలను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని కొత్తగాదికుంట గ్రామంలో బుధవారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సమీపంలో ఉన్న అక్కమ్మగార్ల గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంలో చింతమొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం గురించి, 17 నెలలుగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. వ్యవసాయ, పశువైద్యశాఖ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న గడ్డి విత్తనాలు అందజేశారు. సమీపంలోని అరటితోటను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పార్టీలు, కులాలు చూసి పథకాలు అమలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని పంటలకు ప్రస్తుతం గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, ఎంపీడీఓ గంగావతి, ఏఓ కవిత, వెటర్నరీ డాక్టర్లు మౌలాలి, స్వర్ణలత, ఏపీఓ శంకర్, టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్, సింగిల్‌విండో ప్రెసిడెంటు ముత్యాలు, ఆవుల ముత్యాలు, మాదాపురం శంకర, శ్రీధర్‌నాయుడు, బైటీస్ సురేంద్ర నాయుడు, చంద్రాయుడు పాల్గొన్నారు.

లేవని గేటు..!

మొరాయిస్తున్న సుబ్బరాయసాగర్ గేటు

ఫ్లో లేక మూడు చెరువులకు పారని నీరు

ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు



ఇటీవల గేటును క్రేన్ సాయంతో లాగుతున్న అధికారులు

పుట్లూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ గేట్ మొరాయిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుబ్బరాయసాగర్ గేట్‌ను ఈనెల 13న నాలుగు అడుగుల మేర ఎత్తి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు నీటిని విడుదల చేశారు. అయితే మరమ్మతులకు గురవడంతో గేటును ఇంకా పైకి ఎత్తలేదు. దీంతో ఎక్కువ ప్రవాహం లేక కాలువలో నీరు ముందుకు సాగడంలేదు. ఈనేపథ్యంలో నీరు వృథా కాకుండా 29వ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా బొప్పేపల్లి వైపు మళ్లించారు.

అధికారుల తప్పేనా?

హెచ్చెల్సీ నీరు సుబ్బరాయసాగర్‌కు చేరే సమయానికి గేటు పని చేస్తుందా లేదా అని అధికారులు ముందుగా చెక్ చేసుకోవాల్సి ఉంది. అలాచేయకుండానే గేటుఎత్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల తప్పిదాల వల్ల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ నుంచి సాంకేతిక నిపుణులు వచ్చి చూసినా గేటు మరమ్మతుల చేయలేకపోయారు. సాగర్‌గేటు మరమ్మతుల నేపథ్యంలో 13రోజులు గడుస్తున్నా నీరు రాకపోవడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్యాంలో ఉన్న హెచ్చెల్సీ నీరు పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు నీరు చేరుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఈ మూడు చెరువులకు నీరు చేరితే తాగునీటి సమస్య తీరుతుందని లేకపోతే వేసవికాలంలో పరిస్థితి ఇబ్బందిగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. చెరువులకు నీరు వస్తే తప్ప భూగర్భజలాలు పెరిగి బోర్లు రీచార్జ్ కాని పరిస్థితి ఉంది. గేటు మరమ్మతులకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్యాణం చేస్తున్న పురోహితుడు

వేడుకగా షష్ఠి ఉత్సవాలు

- వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

గార్లదిన్నె/ఆత్మకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా బుధవారం వేకువజాము నుంచే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కోటంక గ్రామానికి చెందిన ఆవుల నాగలక్ష్మి, ఆవుల కంచెప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించారు.

పంపనూరులో..

ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది మంది భక్తులు షష్ఠి ఉత్సవాలకు తరలివచ్చారు.





అలంకరణలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అధ్యక్షా..! అదరగొట్టేశారు..!

- సమస్యలపై నిలదీసిన ప్రతిపక్షం
- దీటుగా బదులిచ్చిన అధికారపక్షం
- స్టూడెంట్ అసెంబ్లీలో జీవించిన విద్యార్థులు



డీఈఓ కార్యాలయంలో స్టూడెంట్ అసెంబ్లీని వీక్షిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా నిర్వహించిన 'స్టూడెంట్ అసెంబ్లీ'లో ఉమ్మడి జిల్లా చిన్నారి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులను రిజర్వేషన్‌ల ఆధారంగా ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో ఎమ్మెల్యేని ఎంపిక చేశారు. రాయదుర్గం ఎమ్మెల్యేగా గంగోత్రి, ఉరవకొండకు లోకేష్, గుంతకల్లుకు స్వప్న, తాడిపత్రికి అనిల్ కుమార్, శింగనమలకు శిరీష, అనంతపురం అర్బన్‌కు సదాఫ్ నాజ్, కళ్యాణదుర్గానికి అభిజ్ఞ, రాప్తాడుకు శ్యామ్ శ్రీనాథ్ రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎంపికయ్యారు. ఈ నెల 22న వీరు ఇద్దరు సోషల్ టీచర్ల పర్యవేక్షణలో అమరావతికి వెళ్లారు. అక్కడ మూడు రోజులు శిక్షణ అనంతరం బుధవారం నిర్వహించిన తమ ప్రత్యేక అసెంబ్లీలో ప్రతిభను చాటుకున్నారు.

అభిజ్ఞ మాటల తూటాలు

కళ్యాణదుర్గం స్టూడెంట్ ఎమ్మెల్యే తలారి అభిజ్ఞ ప్రతిపక్ష ఎమ్మెల్యే పాత్రను పోషించింది. 'మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి' అనే బాధ్యతను విద్యార్థులకు అప్పగించే అంశాన్ని ఎంచుకుని, మాటల తూటాలను పేల్చింది. 'పాఠశాలకు ఆవరణ లేదు.. మొక్కలు ఎక్కడ నాటేది..? తాగేందుకు నీరు లేదు.. మొక్కలకు ఎలా పోసేది..?' అని నిలదీసింది. అచ్చం అసెంబ్లీ పద్ధతిలో స్పీకర్ స్థానాన్ని సంబోధిస్తూ.. 'మంత్రిగారు చెబుతున్న మాటలు పేపర్లలో పచ్చగా బాగా కనిపిస్తున్నాయి..' అని ఎద్దేవా చేయడం అబ్బురపరిచింది. తన మాటలతో అసలు సిసలు ప్రతిపక్ష ఎమ్మెల్యే అనిపించుకుంది. ఇదే అంశానికి స్టూడెంట్ విద్యా మంత్రి బాధ్యతాయుత సమాధానం ఇచ్చారు. 'ప్రభుత్వం పాఠశాలలో తాగునీరు, ఇతర వసతులు కల్పించింది. మొక్కలను పెంచడం గురించి ఎగతాళి చేయడం సరికాదు. విద్యార్థులకు బాధ్యత పెంచేలా ఓ ప్రజాప్రతినిధిగా వారిలో స్ఫూర్తిని నింపాలి' అని సమాధానం చెప్పింది. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యే మధ్య జరిగిన వాదోపవాదాలను అక్కడే ఉన్న సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, సవిత తదితరులు చూసి ఆశ్చర్యపోయారు. తలారి అభిజ్ఞను వారు ప్రశంసించారు.



చించేశారు: స్పీకర్ పోడియం వద్ద ప్రతిపక్ష ఎమ్మెల్యేల నినాదాలు

ఆసక్తిగా వీక్షణ

అమరావతిలో నిర్వహించిన స్టూడెంట్ అసెంబ్లీని ప్రసార మాధ్యమాలలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ప్రజలు ఆసక్తికరంగా వీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన తీరును చూసి అభినందనలు కురిపించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడానికి టీవీలు, స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.

రాయదుర్గం ఎమ్మెల్యే.. గంగోత్రి



బొమ్మనహాళ్ మండలంలోని లింగదహాళ్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని గంగోత్రి రాయదుర్గం ఎమ్మెల్యేగా స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొంది. కానీ సమయాభావం కారణంగా మాట్లాడే అవకాశం రాలేదు. అయినా సరే, తనకు ఇదో అరుదైన అవకాశమని, అద్భుతంగా తమ అసెంబ్లీ సాగిందని గంగోత్రి తెలిపింది.

మార్షల్.. యశ్వంత్



స్టూడెంట్ అసెంబ్లీలో 'మార్షల్'గా గుంతకల్లు విద్యార్థి యశ్వంత్ అవకాశాన్ని దక్కించుకున్నాడు. పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యశ్వంత్, అసెంబ్లీలో మార్షల్ పాత్ర పోషించాడు.

కొత్తిమీర.. గంజాయి..



లేపాక్షి మండలం పులమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని మేఘన మాక్ హిందూపురం ఎమ్మెల్యే హోదాలో అదరగొట్టింది. రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరిగిందని, దాని నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో సభాముఖంగా తెలియజేయాలని ఆమె స్పీకర్ ద్వారా కోరింది. 'ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ అయినా ఆలస్యంగా వస్తోందేమోగాని.. డ్రగ్స్ మాత్రం సమయానికి వస్తున్నాయి.. కాలేజీల వద్ద గంజాయి ఈజీగా దొరుకుతోంది. నగరంలో కొత్తిమీర దొరకడం కష్టమేమోగాని, డ్రగ్స్ మాత్రం పల్లెల్లోకూడా దొరుకుతున్నాయి..' అంటూ ప్రతిపక్ష ఎమ్మెల్యే పాత్రకు కాస్త ఎక్కువ న్యాయమే చేసింది. దీనికి మంత్రి హోదాలో ఉన్న ఓ విద్యార్థిని దీటుగానే బదులిచ్చింది. 'మీ వంటగది పరిజ్ఞానం చూస్తుంటే ముచ్చటేస్తోంది. డ్రగ్స్‌ను నివారించే చర్యలను కూరగాయల మార్కెట్‌తో పోల్చడం సరికాదు. ప్రభుత్వం స్పందించి కేసులు నమోదుచేస్తోంది. వారిని అదుపులోకి తీసుకుంటోంది.' అని బదులిచ్చింది.

జీవితంలో మరిచిపోను...



స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనడం మరచిపోలేని అనుభవమని యాడికి హైస్కూల్ విద్యార్థి అనిల్ కుమార్ అన్నాడు. తాడిపత్రి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్, స్పీకర్ ఎన్నికకు ప్రతిపాదన చేశాడు. స్పీకర్‌గా ఎన్నికైన విద్యార్థిని పోడియం వద్దకు తీసుకువెళ్లి.. గౌరవంగా కూర్చోబెట్టే అవకాశాన్ని దక్కించుకున్నాడు. కూటమి ప్రభుత్వం ఇలా తమ చేత అసెంబ్లీ నిర్వహించడం చాలా గొప్ప విషయమని అనిల్ అన్నాడు.

- తాడిపత్రి ఎమ్మెల్యే అనిల్‌కుమార్

గుంతకల్లు ఎమ్మెల్యే.. స్వప్న



అసెంబ్లీలో కూర్చున్న స్వప్న

స్టూడెంట్ అసెంబ్లీలో గుంతకల్లు ఎమ్మెల్యేగా గుత్తి ఆర్ఎస్ బాలికోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని స్వప్న పాల్గొంది. అసెంబ్లీ కార్యకలాపాల్లో తన బాధ్యతను నెరవేర్చింది. కానీ సమయాభావం కారణంగా మాట్లాడే అవకాశం రాలేదు.

చాలా సంతోషంగా ఉంది: ఉరవకొండ ఎమ్మెల్యే లోకేశ్



ఆర్థిక శాఖ మంత్రితో లోకేశ్

స్టూడెంట్ అసెంబ్లీలో ఉరవకొండ ఎమ్మెల్యేగా పాల్గొనడం సంతోషంగా ఉందని కౌకుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థి లోకేష్ అన్నాడు. విద్యార్థుల చేత అసెంబ్లీ నిర్వహించడం చాలా మంచి నిర్ణయమని ప్రభుత్వాన్ని ప్రశంసించాడు. తమను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పలకరించారని తెలిపాడు. తనకు మాట్లేడికి అవకాశం దొరకలేదని, కానీ అసెంబీలో పాల్గొనడం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నాడు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశామని తెలిపాడు.

లోకేశ్‌తో కలిసి భోజనం చేశాం..



'అసెంబ్లీలో బిల్లులు ఎలా ప్రవేశపెడతారో తెలుసుకున్నాను. ప్రొటెం స్పీకర్, స్పీకర్‌ను ఎలా ఎన్నుకుంటారో చూశాను..' అని సంతోషంగా చెప్పింది వైష్ణవి. నంబులపూలకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వైష్ణవి.. కదిరి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో పాల్గొంది. తనకు ఇది గొప్ప అవకాశమని తెలిపింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబు సహా అందరూ తమతో మాట్లాడారని, తమతో కలిసి మంత్రి లోకేశ్ భోజనం చేశారని తెలిపింది. 'నన్ను కాదని మరొకరిని స్టూడెంట్ అసెంబ్లీకి ఎంపిక చేసినప్పుడు నేను ఎక్స్‌లో మీకు విషయం చెప్పాను..' అని లోకేశ్‌కు వివరించానని, ఆయన సంతోషం వ్యక్తం చేశారని, బాగా చదువుకోవాలని సూచించారని తెలిపింది.

నిజమైన అసెంబ్లీలా..



స్టూడెంట్ అసెంబ్లీ అసలైన అసెంబ్లీలా కనిపించింది. ధర్మవరం ఎమ్మెల్యేగా హాజరయ్యాను. అసెంబ్లీలో స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ఏ విధంగా వ్యవహరిస్తారో కళ్లకు కట్టినట్టు చూశాను. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. సమాజంలో జరుగుతున్న విషయాలు మాకు తెలుస్తాయి. సమస్యలను ప్రస్తావించడానికి నేను సిద్ధమయ్యాను. కానీ అవకాశం ఇవ్వకపోవడంతో కొంచెం బాధపడ్డాను.

- జశ్వంత్, ధర్మవరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి

చాలా బాగుంది..



స్టూడెంట్ అసెంబ్లీలో మాట్లాడానికి నాకు అవకాశం రాలేదు. కొంత బాధగా ఉంది. కొత్తచెరువు మండలం తలమర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీకి వెళ్లాను. ప్రతిపక్షం, పాలక పక్షం ఎమ్మెల్యేల వాదోపవాదాలు, ప్రజా సమస్యలపై నిలదీయడం, మంత్రులు సమాధానం చెప్పడం.. స్పీకర్ సమన్వయం చేయడం చాలా బాగా అనిపించింది. నాకు అవకాశం వచ్చి ఉంటే ప్రభుత్వ విద్యావిధానం గురించి ప్రస్తావించేదాన్ని.

- నిషిత, పుట్టపర్తి స్టూడెంట్ ఎమ్మెల్యే

పోడియం వద్ద పెనుకొండ ఎమ్మెల్యే



జయవర్ధన్‌ను అభినందిస్తున్న మంత్రులు నారా లోకేశ్, సవిత

'ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటాలి' అని ప్రభుత్వం అసెంబ్లీఓల బిల్లు ప్రవేశ పెట్టగా ప్రతిపక్ష ఎమ్మెల్యే లు వ్యతిరేకిస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. అందులో పెనుకొండ ఎమ్మెల్యే జయవర్ధన్ కూడా ఉన్నాడు. రొద్దం మండలం కోగిర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జయవర్ధన్, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా వ్యవహరించాడు. 'తమ పార్టీ' ఎమ్మెల్యేలతో కలిసి స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశాడు. విద్యార్థులు చదువుకోకుండా మొక్కలు నాటాలని బిల్లులు ప్రవేశపెట్టడం దారుణమని, ప్రభుత్వమే మొక్కలను నాటాలని డిమాండ్ చేశాడు. జయవర్ధన్ ప్రతిభనుచూసి పెనుకొండ అసలైన ఎమ్మెల్యే, మంత్రి సవిత అభినందించారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. కంచిసముద్రం గ్రామానికి చెందిన జయవర్ధన్ అసెంబ్లీలో అదరగొట్టడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్లోరైడ్ సమస్యను చెప్పాలనుకున్నా..



'స్టూడెంట్ అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వచ్చుంటే మా నియోజకవర్గంలో ఉన్న ఫ్లోరైడ్ సమస్యను చెప్పాలని అనుకున్నాను. కానీ అవకాశం రాలేదు. స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనడం జీవితంలో మరచిపోలేని అనుభూతి.' అని మడకశిర స్టూడెంట్ ఎమ్మెల్యే సంధ్య చెప్పింది. ఎస్.రాయాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తను పదో తరగతి చదువుతోంది. తాగునీరు, రహదారుల సమస్యపై మాట్లాడేందుకు సిద్ధమై వెళ్లానని, కానీ అవకాశం రాలేదని తెలిపింది.



ఓపీ చీటీ కోసం బారులు తీరిన జనం



మూసివేసిన రేడియాలజీ విభాగం

దిక్కులేని రోగులు

(5వ పేజీ తరువాయి)

గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీజి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సీటీవీఎస్, బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ మొత్తం 17 విభాగాలున్నాయి. వీటిలో కార్డియాలజీ, ఎండో క్రైనాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, సీటీవీఎస్, రేడియాలజీ ప్రధానమైనవి. ఒక్కో విభాగ ఓపీకి నిత్యం 200మంది నుంచి 400మందికి పైగా రోగులు వస్తున్నారు. స్కానింగ్, అపరేషన్, డయాలసిస్ తదితర వైద్యసేవలు అవసరమైన రోగులను వార్డు(ఐపీ)ల్లో అడ్మిట్ చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలోని రోగులు, ఆపరేషన్ చేసిన రోగులు, డయాలసిస్ రోగులకు ఆయా విభాగాల ఐసీయూల్లో వైద్యసేవలందిస్తున్నారు. వీరిని ఉదయం, మధ్యాహ్నం, రాత్రివేళ క్రమం తప్పకుండా సంబంధిత డాక్టర్ పరీక్షించాలి. పరిస్థితిని బట్టి బాధితులకు అవసరమైన స్కానింగ్‌లు రాయడం, మందులు పెట్టడం చేయాలి. అయితే ఉదయం ఓపీల్లోనే అలసిపోతున్న డాక్టర్లు అనేకమంది ఐపీ, ఐసీయూ రౌండ్స్‌కు వెళ్లడం లేదు. ప్రాణాలు పోతున్నాయని వాపోతేమాత్రమే డ్యూటీలోని సిబ్బందికి ఫోన్‌చేసి ఫలానా ఇంజక్షన్, మాత్ర ఇవ్వాలని చెబుతున్నారని రోగులు కన్నీటి పర్యంతరమౌతున్నారు.

పీజీలు, హౌస్‌సర్జన్లు ఎక్కడ..?

ప్రభుత్వ వైద్య కళాశాలకు బోధనాస్పత్రులుగా సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. ఈ రెండు ఆస్పత్రుల్లోనూ వైద్య కళాశాల డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ)విద్యార్థులు, ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు(హౌస్‌సర్జన్స్) పనిచేస్తున్నారు. విభాగాల వారిగా సంబంధిత డాక్టర్ల వద్ద ప్రాక్టీస్ చేయడం, అభ్యసించడం పీజీ, హౌస్‌సర్జన్ విద్యార్థుల విధి. ఆ మేరకు సర్వజన వైద్యశాలలో విద్యార్థులకు డ్యూటీలు వేస్తున్నారు. కానీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డ్యూటీలు వేయడంలేదని డాక్టర్లు చెబుతున్నారు. 'ఓపీలలో స్కానింగ్‌ల నుంచి మందుల చీటీల వరకు మేమే రాయాలి. ఐపీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ ఇలా అన్ని దగ్గరుండి చూసుకోవాలి. డాక్టర్లంటే మేమూ మనుషలమే ఎలా పనిచేయాలి' అని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వైద్య పోస్టుల ఖాళీల భర్తీకి చొరవ చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కార్డియాలజీ ఐసీయూలో చికిత్సలు పొందుతున్న రోగులు

డ్యూటీలు వేస్తున్నాం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్లకు సహాయకంగా పీజీ, హౌస్‌సర్జన్స్‌కు డ్యూటీలు వేస్తున్నాం. ఆ మేరకు వారు డ్యూటీలకు వెళ్తున్నారు. డ్యూటీలు చేస్తున్నట్లు విద్యార్థులు కూడా చెబుతున్నారు. వెళ్తున్నారా? లేదా? విచారణ చేస్తాం. అదేవిధంగా డాక్టర్ల కొరత, రోగుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో పంపాం. త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

-డాక్టర్ విజయశ్రీ, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్

విభాగాల వారిగా ఖాళీల సంఖ్య...

విభాగం	ప్రొఫెసర్	అసోసియేట్	అసిస్టెంట్
అనస్తీషియా	1	1	0
కార్డియాలజీ	1	0	1
ఎండో క్రైనాలజీ	0	1	2
మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ	1	1	2
న్యూరో సర్జరీ	0	1	0
న్యూరాలజీ	1	1	0
నెఫ్రాలజీ	1	0	2
యూరాలజీ	1	0	0
సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ	1	1	0
సీటీవీఎస్	1	0	1
బయోకెమిస్ట్రీ	1	0	1
పెథాలజీ	1	0	1
మైక్రోబయాలజీ	1	0	1
రేడియాలజీ	1	1	0
ఎమర్జెన్సీ మెడిసిన్	0	0	2
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్	1	1	2
ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్	0	0	1
మొత్తం ఖాళీలు	**13**	**8**	**16**

పంచాయతీనే కావాలి..!

(5వ పేజీ తరువాయి)

రూరల్-అర్బన్ కేటగిరిలో చేర్చారు. వీటికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులనే నియమిస్తారా.., డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి అధికారిని కేటాయిస్తారా.. అన్నదానిపై స్పష్టత లేదు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందినవారు, ఆ జాబితాలో ఉన్నవారు సైతం రూరల్-అర్బన్ పంచాయతీలను వదిలి వెళ్లడానికి సుముఖత చూపడం లేదన్న చర్చ జరుగుతోంది. సాధారణ ఉద్యోగోన్నతుల్లో భాగంగా డిప్యూటీ ఎంపీడీఓ అయినవారు కూడా.. వదిలి వెళ్లడానికి నిరాకరిస్తున్నారని తెలుస్తోంది. నూతనంగా మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారి నియామకంలో భాగంగా చాలామంది గ్రేడ్-1, ప్రస్తుతం రూరల్-అర్బన్ పంచాయతీలుగా ఎపింకైన వాటిలో పనిచేసే కార్యదర్శులకు అవకాశం కల్పిస్తారన్న చర్చ సాగుతోంది. దీంతో ప్రస్తుతం ఉన్నవారితోపాటు, ఇప్పటికే ఆ స్థానం నుంచి ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపీడీఓలుగా వెళ్లినవారు సైతం తిరిగి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగోన్నతి వదులుకోవడానికి కూడా సిద్ధపడ్డారన్న చర్చలు వినిపిస్తున్నాయి. మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారిగా డెప్యుటేషన్‌పై వెళ్తే అక్కడ పెద్దగా పని ఉండదని భావించి తమ పలుకుబడి వినియోగించుకుని ఇక్కడే మకాం వేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం మండలాల కేటాయింపునకు సైతం ఆప్షన్ ఇవ్వడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఉద్యోగోన్నతి నిరాకరించిన వారికి కొందరు సీనియర్లు.. ఎందుకు వదులుకుంటారని హితబోధ చేస్తున్నారని ఆ వర్గాల సమాచారం. దీంతో ఉద్యోగోన్నతి కావాలి.. పంచాయతీ నాదే అన్న రీతిలో ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందిన వారిని తిరిగి అదే పంచాయతీకే కేటాయిస్తే.. ఇక తామేం చేయాలంటూ ప్రస్తుత కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో అంతా తామై వ్యవహరించిన వారు, డిప్యూటీ ఎంపీడీఓలుగా అధికారాల్లేకుండా కూర్చోవడానికి ఆసక్తి చూపట్లేదు. ప్రజాప్రతినిధులతో సఖ్యతగా ఉన్నవారి ద్వారా రూరల్-అర్బర్ పంచాయతీలో పాగావేసే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. కొందరు.. తమకు సన్నిహితంగా ఉన్న ప్రజాప్రతినిధుల వద్ద తిరిగి తామే వస్తామనీ, మరొకరికి అవకాశం ఇవ్వద్దని ఒప్పందాలు చేసుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం జారీచేసిన ఉద్యోగోన్నతుల జాబితాలో ఖాళీ అయ్యే స్థానాల కోసం పంచాయతీ కార్యదర్శులు.. స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదిస్తుండగా.. తమ వారే వస్తారని చెబుతుండడంతో షాక్‌కు అనవుతున్నారు.

జిల్లాలో 14 రూరల్-అర్బన్ పంచాయతీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం జిల్లాలో 14 రూరల్-అర్బన్ పంచాయతీలుగా తేల్చారు. వీటిలో అనంతపురం రూరల్ మండలంలోని నారాయణపురం, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేట, అనంతపురం రూరల్, రాచానపల్లితోపాటు బుక్కరాయసముద్రం, నార్పల, గన్నేవారిపల్లి, ఉరవకొండ, యాడికి, కంబదూరు, కణేకల్లు, పామిడి పంచాయతీలున్నాయి. వీటిపై డిప్యూటీ ఎంపీడీఓల కన్ను పడిందన్న చర్చ జరుగుతోంది. ఈ ప్రాంతాల్లో పనిచేసి ఇప్పటికే ఉద్యోగోన్నతి పొందిన వారు, ఇక్కడే పనిచేస్తూ ప్రమోషన్ జాబితాలో ఉన్నవారు జోడు పదవులు నిర్వహించడానికి పైరవీలు సాగిస్తున్నారని ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పైరవీలదే పైచేయి అవుతుందా..? అర్హులకు న్యాయం చేకూరుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

పెళ్లికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు

- కారు, కంటైనర్ ఢీ.. ఇద్దరి మృతి
- మృతులు శ్రీసత్యసాయి జిల్లావాసులు


నుజ్జయిన కారు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్లి.. బంధువులతో కలిసి సంతోషంగా గడిపారు.. ముహూర్తం చూసుకుని కారులో తిరిగి వస్తుండగా అంతలోనే మృత్యువు కబళించింది. ముంబై-చెన్నై జాతీయ రహదారిలో కారు, కంటైనర్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం సాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చాపిరెడ్డి వెంకటరమణ (65), చాపిరెడ్డి రాజశేఖర్ (40) ఇద్దరూ బంధువులు. కొన్నేళ్లుగా ఇరు కుటుంబాలు మదనపల్లెలో నివాసముంటున్నాయి. సీవీ వెంకటరమణ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొంది చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. సీవీ రాజశేఖర్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం తవళంలో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి కారులో వెళ్లారు. బుధవారం ఉదయం ముహూర్తం చూసుకుని తిరిగి కారులో మదనపల్లెకు బయలు దేరారు. ఈ క్రమంలో వేపూరికోట వద్ద కారు, కంటైనర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందారు. మృతదేహాలు కారులోనే ఇరుక్కుపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంలో అతికష్టం మీద బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ నరసింహుడు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


నారాయణ స్వామి (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద ముష్టూరు గ్రామ కౌలు రైతు నారాయణస్వామి(40) అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణస్వామి తన తల్లి పేరిట ఉన్న రెండు ఎకరాలు, కౌలు పొలం ఐదు ఎకరాలలో మిరప, వేరుశనగ, కంది పంటలను సాగు చేసేవాడు. మూడేళ్ల నుంచి పంట నష్టపోవడంతో అప్పులు రూ.10 లక్షల దాకా పేరుకుపోయాయి. వాటిని తీర్చే మార్గం లేక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి, ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


గుర్తుతెలియని వ్యక్తి దేహం

కదిరి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గూడ్స్ షెడ్ సమీపాన గల చింత చెట్టుకింద ఓ వ్యక్తి మృతిచెంది ఉండడంతో స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని, పరిశీలించారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని సీఐ తెలిపారు. తెలుపు టీషర్టు, నలుపురంగు కాటన్ ప్యాంటు ధరించినట్లు చెప్పారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసు స్టేషన్‌లోగానీ, 9440796851 నంబరులో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు


జుజారు మణి (ఫైల్)

ధర్మవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మరణించిన ఓ వ్యక్తి నేత్రదానం చేసి ఇద్దరికి వెలుగులు నింపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన జుజారు మణి(40) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో విశ్వదీపాసేవాసంఘం సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు నేత్ర వైద్య నిపుణుల సహకారంతో కంటి కార్నియా సేకరించారు. నేత్రదానానికి అంగీకరించిన మృతుడి భార్య లక్ష్మీ, కుమారులు కార్తీక్, దినకర్, సోదరులు జుజారు తాయప్ప, తాయేంద్ర, రఘులకు విశ్వదీపాసంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వదీపాసేవాసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, సంఘం పట్టణ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జుజారు రఘు, నాగార్జున, ఆదినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నా ఇష్టం వచ్చినప్పుడు ఇస్తా..!

తహసీల్దార్ దురుసు ప్రవర్తన.. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నల్లచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'ఆఫీస్ నుంచి మర్యాదగా బయటికిపో. నాకు ఇష్టం వచ్చినప్పుడు ఇస్తా' అని తహసీల్దార్ దురుసుగా ప్రవర్తించాడని ఎమ్మెల్యే కందికుంటకు ఫిర్యాదు చేసినట్లు ఓ బాధితుడు తెలిపాడు. కె.పూలకుంట సచివాలయంలో దామలవాండ్లపల్లికి చెందిన మల్లికార్జున తన కుటుంబ సభ్యుల పేరు మీద పొజిషన్ సర్టిఫికెట్ కోసం గత నెల 31న దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామ సర్వేయర్ ద్వారా ఇంటి స్థలాన్ని సర్వేచేయించుకొని సర్వే పత్రాలు సైతం తహసీల్దార్ కార్యాలయానికి అందజేసినట్లు తెలిపాడు. వీఆర్‌ఓ లాగిన్‌కి ఈ నెల 13న మార్చారు. అప్పటి నుంచి ప్రతి రోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, పత్రాలన్నీ సరిగా ఉన్న తహసీల్దార్ లాగిన్‌లో ఆమోదించలేదని మల్లికార్జున ఫిర్యాదులో పేర్కొన్నాడు. హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వరకే గడువు ఉండటంతో బుధవారం కార్యాలయానికి వచ్చి పొజిషన్ సర్టిఫికెట్ గురించి తహసీల్దార్‌ను అడిగానన్నారు. దీంతో తహసీల్దార్ ఆఫీస్ నుంచి బయటకు వెళ్లు అంటూ దురుసుగా ప్రవర్తించాడని బాధితుడు మల్లికార్జున ఎమ్మెల్యేకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ఫిర్యాదును కదిరిలో ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేసినట్లు తెలిపాడు. ఈ విషయమై తహసీల్దార్ జమానుల్లాఖాన్‌ను వివరణ కోరగా ఆఫీస్‌లో గట్టిగా మాట్లాడవద్దని, అలా మాట్లాడేవారు ఎవరైనా ఉంటే బయటకు వెళ్లాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా లక్ష్మీప్రసాద్ ప్రమాణం

హాజరైన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు


ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు

అనంతపురం క్రైం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన చల్లా లక్ష్మీప్రసాద్‌బాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో ఏపీఐఐసీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్, తోటి డైరెక్టర్లతో కలిసి అనంతపురానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, అనంతపురం, మడకశిర ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు హాజరయ్యారు. చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. లక్ష్మీప్రసాద్ బాబుకు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ....తన గెలుపునకు చల్లా లక్ష్మీప్రసాద్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనకు డైరెక్టర్ పోస్టు దక్కడం, ప్రమాణ స్వీకారానికి తాను హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఏపీఐఐసీ గతంలో కంటే భిన్నంగా పనిచేస్తోందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీకి భారీగా పరిశ్రమలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో ఏపీఐఐసీ మరింత మెరుగ్గా పనిచేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సోషలిస్టు పాలనతోనే దేశ పురోగతి

ప్రజాహక్కులను నెరవేరిస్తేనే అభివృద్ధి
సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
ఘనంగా రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు


ప్రసంగిస్తున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


కవాతు నిర్వహిస్తున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు, సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోషలిస్టు పాలనతోనే దేశం పురోగతి వైపు అడుగులు వేస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. ప్రథమ సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి క్లాక్‌టవర్ మీదుగా లలితకళాపరిషత్ వరకు రెడ్‌షర్ట్ వలంటీర్స్ కవాతు నిర్వహించారు. అనంతరం పరిషత్ ఆవరణలో పలువురు కళాకారులు ఎర్రజెండా పాటలకు నృత్యాలతో అలరించారు. తదనంతరం 'సోషలిజం ఔన్నత్యం - సామ్రాజ్యవాద ప్రమాదం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో బీవీ రాఘవులు మాట్లాడారు. సోషలిజంతో ఎంత మేలు జరుగుతుందనే దానికి రష్యా నిదర్శనమన్నారు. రష్యాలో విద్య, వైద్యం, ఉపాధి వంటివి అందరికీ నాణ్యమైన పద్ధతిలో సమాన హక్కుగా ఉండగా... భారతదేశంలో మాత్రం ఆరోగ్యాన్ని, విద్యను వ్యాపారం చేయడంతోపాటు ప్రభుత్వ భూములను అమ్మి సొమ్ము చేసుకునే పాలకులున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ బడాబాబులకు వత్తాసు పలికేవారే తప్ప.. సామాన్య ప్రజలు, కార్మికులు, రైతాంగానికి న్యాయం చేసే పాలకులు కనిపించడలేదన్నారు. జబ్బులురాని మంచినీరు కూడా లభించని దౌర్భాగ్య సమాజంలో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దేశ మహిళల్లో రక్తహీనత ప్రభావం ఎక్కువగా ఉందనీ, ఇలా మరే దేశంలోనూ లేదని పేర్కొన్నారు. ప్రజల హక్కులైన నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యం, సొంత ఇల్లు, ఉద్యోగం, వృద్ధులకు పింఛన్, వ్యవసాయం చేసే ప్రతిఒక్కరికీ భూమి తదితరాలను నెరవేర్చినపుడే దేశం అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. వ్యవస్థలోని సమస్యలన్నింటిపై ప్రభుత్వంతో పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

మహిళలకు భద్రత ఏదీ: రాంభూపాల్

మహిళలు, యువతులు బయటకు వెళ్తే ఇంటికి క్షేమంగా తిరిగొస్తారా.. లేదా.. అనే అభద్రత నడుమ బతుకుతున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. రూ.లక్షలు వెచ్చించి పిల్లలను చదివిస్తే వారికి ఉద్యోగం వస్తుందనే నమ్మకం కూడా లేదని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మోసాలు, దౌర్జన్యాలు చేసినవారే రాజ్యాధికారం చేపడుతుండడం బాధాకరమన్నారు. దేశానికి కావాల్సింది మతతత్వం కాదు, మత సామరస్యం అన్నారు. కేంద్రంలో 11 సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని తెలిపారు. కార్పొరేట్లకు మద్దతుగా కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోనూ రైతాంగం అనేక సమస్యలతో కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పాలకుల్లో స్పందన లేదన్నారు. జిల్లాలో అరటి ధర పడిపోవడంతో పంటను ఏమీ చేసుకోలేక బాధాతప్త హృదయాలతో రైతులు పంటను దున్నేసుకుంటున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.40వేల కోట్లు రావాల్సుండగా ఇప్పటి వరకు రూ.12వేల కోట్లు మాత్రమే సాధించుకోగలిగారన్నారు. వైసీపీ అధినేత రోడ్ల మీదకు వచ్చి హడావుడి చేయడమే తప్ప.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించడం లేదన్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే తనకు ఏమౌతుందో తెలుసు కాబట్టే జగన్ బీజేపీని ప్రశ్నించే ధైర్యం చేయట్లేదని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం.. మావోయిస్టులను పిట్టల్ని కాల్చేసినట్లు కాల్చేస్తే సీపీఎం సహించదని హెచ్చరించారు. వారితో శాంతియుతంగా చర్చలు జరిపాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ... పాలకవర్గాల విధానాలు ప్రజల పాలిట ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో భూములు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోవడం ద్వారా వ్యవసాయం తగ్గిపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదం అంతరించిపోయే దశకు చేరుకుంటున్న ఈ తరుణంలో దేశ రక్షణకు సోషలిస్టు పాలన తప్ప.. ప్రత్యామ్నాయం లేదన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం రాష్ట్ర నేత ఓబులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, ఆర్‌వీ నాయుడు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

కృష్ణాజలాలతో బంగారు పంటలు

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బుక్కపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాలలో రైతులు బంగారు పంటలు పండించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆకాంక్షించారు. హంద్రీనీవా కాలువ ద్వారా బుక్కపట్నం చెరువుకు కృష్ణాజలాలు వదులుతున్నారు. చెరువు పూర్తిగా నిండి, మరువపోతోంది. దీంతో బుధవారం చెరువు కట్టపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జలహారతి ఇచ్చారు. తూముల ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుక్కపట్నం చెరువు 0.5 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో జలకళ సంతరించుకుందన్నారు. చెరువు కింద ప్రత్యక్షంగా 3 వేల ఎకరాలు, పరోక్షంగా మరో 10 వేల ఎకరాలు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపుతామన్నారు. బుక్కపట్నం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డీపీఆర్ తయారు చేయాలని బాబా శతజయంతి వేడుకలకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్‌కు ఆదేశించడం హర్షణీయమన్నారు. చెరువులో జంగిల్ క్లియరెన్స్ పనులు లుచేపట్టి, కొండవైపు దేవాలయానికి రోడ్డు నిర్మిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. స్లూయిజ్ గేట్ ఎత్తి, ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు సంజీవరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ మల్లిరెడ్డి, టీడీపీ నేతలు గంగాధర్, సామకోటి ఆదినారాయణ, కొత్తచెరువు కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బుక్కపట్నం సింగిల్ విండో అధ్యక్షుడు చెన్నకృష్ణ, మాజీ సర్పంచ్ యశోదరాయుడు, లావణ్య పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలతో రైతుల్లో ఆనందం


హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

నంబులపూలకుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలో చెరువులు కృష్ణా జలాలతో నింపడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని పడమరనడింపల్లి, గౌకనపేటలో బుధవారం అధికారులు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరైతు చూసి నా ఆనందం వ్యక్తం చేశారు. మూడు చెరువులకు నీరు వచ్చిందని.. ఖరీఫ్, రబీలో పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉంటుందని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా కరువుతో సతమతమయ్యామన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌తో గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా అనుకూలంగా ఉండే చెరువులను నింపుకుంటూ తలుపుల మండల మీదుగా ఎన్పీకుంటలోని చెరువులు నింపుతున్నట్లు వారు పేర్కొన్నారు. చెరువులకు నీటిని నింపడంతో బీళ్లు సైతం సాగుచేసుకుని జీవిస్తామని, రైతులు ఇక ఎక్కడికి వలసలు వెళ్లాల్సిన అవసరంలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పట్టణాలకు వలసలు వెళ్లారు. వారు స్వగ్రామాలకు వచ్చి పంటలు సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం పొలం పిలుస్తోంది. పొలంబడి, క్లస్టర్ డెమో, మట్టినమూనా సేకరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. రైతులకు సరిపడే యూరియాను కొరత లేకుండా సరఫరా చేస్తోందన్నారు. ఏడు రోజులపాటు జరిగే రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రైతులు విజయ్‌కుమార్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

శభాష్ కుసుమ..!

కిలిమంజారో పర్వతారోహకురాలిని అభినందించిన సీఎం


సీఎం చంద్రబాబుకు చిత్రపటం అందజేస్తున్న కుసుమ

శింగనమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'కుసుమ..శభాష్.! ఇదే పట్టుదలతో నీవు కృషి చేస్తే తప్పకుండా ఎవరెస్ట్ ఎక్కుతావు. నీకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది' అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. నార్పల మండల దుగ్గుమర్రికి చెందిన కుసుమ ఇటీవల ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె తన కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. పర్వతారోహణ అనంతరం అక్కడ తీసుకున్న ఫొటోను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అండగా ఉంటుందని, కుసుమ పట్టుదల చూస్తే ఎవరెస్టు పర్వతాన్ని తప్పకుండా అధిరోహిస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు. కుసుమకు భవిష్యత్తులో అన్నివిధాలుగా అండగా ఉంటామని ఆమెకు ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

చట్టాలకు మూలాధారం.. రాజ్యాంగం

జడ్పీ చైర్‌పర్సన్


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోని చట్టాలన్నింటికీ మూలాధారం రాజ్యాంగమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించగలుగుతున్నారంటే అది రాజ్యాంగం గొప్పతనం అన్నారు. అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, వాటిలోని విశిష్టమైన అంశాలను తీసుకుని దేశ ప్రజలకు ఉపయోగపడేలా ప్రతిష్ఠాత్మకంగా అప్పట్లో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓలు ప్రభాకర్, తేజోత్స్న, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున, శ్రీవాణి, మాధవి, అరుణకుమారి పాల్గొన్నారు.

'వద్ది'కి పదవి

అఖిల భారత పద్మశాలి సంఘం తిరుపతి అన్నసత్రం అధ్యక్షుడిగా ఎంపిక



తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి సంఘం తిరుపతి అన్నసత్రం అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తాడిపత్రికి చెందిన వద్ది శివసత్యనారాయణ పేర్కొన్నారు. తిరుపతిలో బుధవారం జరిగిన అఖిల భారత సేవా కమిటీ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ధర్మకర్త, జనరల్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పదవులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అన్నసత్రం అధ్యక్షుడి పదవి రావడం ఎంతో గర్వకారణమన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు డిసెంబరు 10వరకు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం తెలిపారు. జిల్లాలో సెయింట్ మేరీ బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (అనంతపురం)లో ఎస్‌ఏ బయాలజీ, ఎస్‌ఏ తెలుగు, ఎల్‌పీటీ తెలుగు, ఎల్‌పీటీ హిందీ, పీఈటీ పోస్టులు ఉన్నాయన్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్(అనంతపురం)లో ఐదు ఎస్జీటీ పోస్టులు ఉన్నాయన్నారు. మహిళలే అర్హులన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసిందన్నారు. దానిని డిసెంబరు 10 వరకు పొడిగించామన్నారు.

పది పరీక్షల ఫీజు గడువు సైతం..

పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగించనట్లు డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు అపరాధ రుసుంలేకుండా ఫీజు కట్టవచ్చన్నారు. 11 నుంచి 12 వరకు రూ.25 అపరాధ రుసుంతో, 15వరకు రూ.50 ఫైన్‌తో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు.

ట్యాలీ ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ యువతకు బెంగళూరులో ఉచితంగా కంప్యూటర్ ట్యాలీ కోర్సులో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. డిసెంబరు 1 నుంచి 35రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

నేడు జైళ్లశాఖ ఐజీ రాక

బుక్కరాయసముద్రం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసులు రానున్నట్లు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్ వసంతకుమార్ తెలిపారు. జైలులో గురువారం నిర్వహిస్తున్న వేలం పాటలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు. జైలుకు సంబంధించి 36 ఎద్దులు, 1600 చింత చెట్లు, 400 సపోటా చెట్లకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపైనే శిక్షణ

జడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన అంశంగా డీడీఓలకు శిక్షణ ఇచ్చారని జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎంపీడీఓ నుంచి ఇటీవల డివిజనల్ అభివృద్ధి అధికారి(డీడీఓ)గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన.. 15 రోజుల పాటు విజయవాడలో శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగించుకుని వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన అంశంగా శిక్షణ ఇచ్చారన్నారు. అందులో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నానన్నారు. వనరులను గుర్తించి, వాటి ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చడంపై శిక్షణ ఇచ్చారన్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను ద్వారా సమకూరే సొమ్మును పూర్తిస్థాయిలో రాబడితే పంచాయతీలకు నిధుల కొరతే ఉండదన్నారు. మంచినీటి సరఫరాపై వివరించారని ఆయన తెలిపారు.

అన్ని స్కూళ్లలో ఆర్వో ప్లాంట్లు పని చేయాలి

● కలెక్టర్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేసేలా సత్వరమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంక్షేమ, విద్యాశాఖలతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు చాలావరకు భర్తీ అయ్యాయనీ, ఇంకా ఖాళీలు ఉంటే.. చర్యలు తీసుకుంటామనీ, సంబంధిత వివరాలను రాష్ట్ర విద్యాశాఖకు పంపామన్నారు. డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ సమన్వయంతో ఎంఈఓలు కలిసి సమీక్ష చేయాలన్నారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మరమ్మతుల బారిన పడి ఉండుంటే మరమ్మతులు చేయించాలన్నారు. వసతి గృహాల్లో పరిశుభ్ర వాతావరణం, రక్షిత మంచినీరు ఉండాలన్నారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి కుష్బూకొఠారి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి నాగమణి పాల్గొన్నారు.

సైనిక కుటుంబాల సహాయార్థం విరాళాలు ఇవ్వండి

దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనిక కుటుంబాల సహాయార్థం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. డిసెంబరు 7న సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి సంబంధించిన కార్ ఫ్లాగ్‌లు, స్టిక్కర్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సైనికులు, మాజీ సైనికులు యుద్ధ, విపత్తు సమయాల్లో దేశానికి అండగా ఉంటున్నారన్నారు. వారికి అందరూ అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

అనంతపురంరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామంలో గల వైఎస్సార్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, తెలుగు రైత నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి సర్దార్‌వలి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై భూమిపూజ చేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ధర్మేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లాకు పతకాలు



విజేతలను అభినందిస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఇటీవల కాకినాడలో రాష్ట్ర స్థాయి జూడో పోటీలు నిర్వహించారు. 60కిలోల విభాగంలో జిల్లాకు చెందిన క్రీడాకారులు నరసింహనాయక్ ప్రథమ స్థానం, 81కిలోల విభాగం గోవర్ధన్ ద్వితీయ స్థానం, 78కిలోల విభాగంలో సాయిహర్షిత మొదటి స్థానం, 57కిలోల విభాగంలో వెన్నె ద్వితీయ స్థానం, వైష్ణవి, లీజీకుమారి తృతీయ స్థానంలో పతకాలు సాధించారు. వారిని బుధవారం స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ అభినందించారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జూడో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సాకే గోవిందు, కోశాధికారి విక్టర్, బాస్కర్‌రాయుడు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు హిమజ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి హిమజ ఎంపికైంది. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన ఈమె ఈ నెల 27వతేదీ నుంచి హర్యాణాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రాఘవేంద్ర, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు సీఏ విశ్వనాథ్ చౌదరి, డీఎస్‌డీఓ మంజుల, శాప్ కోచ్‌లు బుధవారం హిమజను అభినందించారు.



హిమజను అభినందిస్తున్న శాప్ కోచ్ సంధ్య

ముగిసిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి పారా క్రీడాపోటీలు బుధవాం ముగిశాయి. స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో, అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మొత్తం 200 మందికి పైగా విభిన్నప్రతిభావంతుల క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో మొత్తం 42మంది బాల, బాలికల క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వారికి డిసెంబరు 3న బహుమతులు ప్రదానం చేస్తామని డీఎస్‌డీఓ తెలిపారు. డీఎస్‌ఏ సూపరిండెంట్ దేవమణి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, శాప్ కోచ్‌లు పాల్గొన్నారు.

కరాటే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



కరాటే రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరాటే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు రాజమహేంద్రవరంలో జరిగాయి. ఇందులో జిల్లా నుంచి గోజూరియో కరాటే క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చూపారు. అండర్-17 విభాగంలో హాసినిరెడ్డి స్వర్ణ పతకం, లక్ష్మీనరసింహారెడ్డి కాంస్య పతకం సాధించారు. అలాగే అండర్-14లో సుదీప్‌రెడ్డి, జ్యోత్ సాయిప్రశాంత్ కాంస్య పతకాలు సాధించారు. అండర్-17 విజేతలు డిసెంబరు నెలాఖరులో భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని, అండర్-14 విభాగ విజేతలు జనవరి మొదటి వారంలో పూణెలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని కోచ్ మురళీకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు పేరూరు విద్యార్థిని

రామగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని పేరూరు ఉన్నతపాఠశాలకు చెందిన బీ.శ్రావ్య జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇందుకు ఆమెను ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం వెంకటాపురంలోని నివాసంలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అండర్-17 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో కృష్ణాజిల్లా నూజివీడులో జరిగిన పోటీలలో శ్రావ్య పాల్గొని అత్యుత్తమప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పాఠశాలకు అవసరమైన క్రీడాపరికరాలను అందించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. హెచ్‌ఎం అరవిందు,పీడీలు వారాధి, నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

భారత రాజ్యాంగం.. ప్రపంచ దేశాలకు ఆదర్శం

● రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో వక్తలు ● బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని వక్తలు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భారత రాజ్యాంగం పీఠికకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశంలోని పేద, అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడానికి రాజ్యాంగంలోని సూత్రాలు ఎంతో ఉపకరిస్తున్నాయని తెలిపారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న భారత రాజ్యాంగం ఎంతో ఉన్నతమైందని పేర్కొన్నారు. పలు చోట్ల పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఎస్కేయూలో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకల్ని ప్రారంభిసుర్తన్న వీసీ అనిత

'సాగునీటిపై రైతులు ఆందోళన చెందకండి'

శింగనమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలంలో సుబ్బరాయుడు సాగర్ వద్ద ఏర్పడిన గేట్ సమస్య వల్ల సాగునీటిపై రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. మంగళగిరిలో బుధవారం జనవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి ఈ సమస్యపై వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సాంకేతిక నిపుణులను పంపించి గేటును వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశాలను మంత్రి జారీ చేసినట్లు తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కూడా తెలిపారని అన్నారు. పుట్లూరు మండలానికి శాశ్వత పరిష్కారంగా ఉన్న గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఇది నేరవేరితే దాదాపు 35 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే గాక 15 గ్రామాలకు తాగునీటి సమస్య కూడా పరిష్కారం అవుతుందని అన్నారు. ఎంపీఆర్ గేట్ల మరమ్మతులకు కూడా రూ.5.25 కోట్లు త్వరలోనే మంజూరవుతాయని, అనంతరం పనులు ప్రారంభమవుతాయని ఆమె చెప్పారు.



మంత్రి రామానాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

సామాజిక అంశాల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

అనంతపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక అంశాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్ సూచించారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని విజయనగర లా కాలేజీలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక అంశాల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే రాజ్యాంగ పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామిరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్, వైస్ ప్రిన్సిపాల్ మహేష్, పరిశోధక అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్

'రాజ్యాంగంపై అవగాహన కల్పించడంలో విఫలం'

అనంతపురం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, తద్వారా ప్రజాస్వామ్య విలువలు నశించిపోతున్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కల్పిస్తోందన్నారు. కానీ రాజ్యాంగం సక్రమంగా అమలు కాకపోవడంతో ప్రజాస్వామ్యం బలహీనపడుతోందన్నారు. తద్వారా అధికారం, డబ్బు ఉన్నవారికి చట్టాలు చుట్టాలుగా పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా రాజ్యాంగంపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఐక్యవేదిక జిల్లా నాయకులు సాంబశివుడు, టీవీ రెడ్డి, సామాజిక ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో సదస్సు

అనంతపురం వైద్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం 'డిజిటల్ లైవ్లీహెడ్ అండ్ కాన్సిస్ట్యూషనల్ వ్యాల్యూస్ ఎన్‌మారింగ్ ఈక్విటీ ఇన్ ది న్యూ ఎకానమి' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. వీసీ ఎస్‌ఏ కోరి అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కలెక్టర్ హరి చందన ముఖ్య అతిథిగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ వేదికగా ఉపాధి రంగం విస్తరిస్తోందన్నారు. విద్యార్థులు ఆదిశగా మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. సదస్సు ప్రారంభానికి ముందు అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో టీచింగ్ ఫ్యాకల్టీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో 'రైతన్నా.. మీకోసం'

గార్లదిన్నె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. రైతన్నా మీ కోసం కార్యక్రమం ద్వారా రైతు సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన పంచసూత్రాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సూర్య హరిబాబు, వీఏఏ శ్రీజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కల్లూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

● అనంతపురంరూరల్: మండలంలోని ఉప్పరపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పశుసంవర్థకశాఖ జేడీ ప్రేమ్ చంద్ హాజరై రైతుల ఇంటి వద్దకు వెళ్లి కార్యక్రమం గురించి వివరించారు. పశుసంవర్థకశాఖ డీడీ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బస్సుపాస్‌ల కోసం వెళ్లిన దివ్యాంగులను కించపరిచడంతోపాటు పాస్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిన కళ్యాణదుర్గం డిపో హెడ్‌క్లర్క్ శివప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎంఓ కార్యాలయ పీఓ చంద్రాయుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్, కార్యదర్శి రాజేష్, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షుడు దొనస్వామి పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

కనగానపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విద్యుత్ ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి బిల్లే వరుణ్(16) మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాద సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ బుధవారం తెలిపారు. మండల విద్యుత్‌శాఖ అధికారి కొండారెడ్డితో పాటు లైన్‌మెన్ బ్రహ్మయ్య, హెల్పర్ నాగరాజు, పొలం రైతు దస్తగిరిబాబు, వంశీలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆమోద దినోత్సవాలను పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ద్వారా పలు పాఠశాలల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. అందులో ప్రతిభ కనబరచిన 15 మందికి కలెక్టర్ తన చాంబర్‌లో మొమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. వారితో కాసేపు ముచ్చటించారు. వారికి పలు సూచనలు చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లోని పలు విభాగాలను, 150 సంవత్సరాల పాత రికార్డులను భద్రపరచిన గదిని పిల్లలకు చూయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ పాల్గొన్నారు.

సాగునీరు విడుదల

శింగనమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు ఆయకట్టు కింద పంటల సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం చెరువు ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ చెరువులో మూడు తూములు ఎత్తి సాగు నీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు నీటిని వృథా చేయకుండా వంతులుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు రాజ్‌కుమార్, సాయినాథ్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

గార్లదిన్నె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ ఆనంద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బండారు ఈ రమ్మతో మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో ప్రజలు వినతిపత్రాల ద్వారా తెలియజేసిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు.

ఆప్టా నాయకుల సభ్యత్వనమోదు

అనంతపురం విద్య, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం, అనంతపురం రూరల్ మండలాలలో బుధవారం ఆప్టా నాయకులు సభ్యత్వనమోదు చేపట్టారు. ఈసందర్భంగా టీచర్లు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఉమర్

అనంతపురం క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ నాయకుడు, దూదేకుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉమర్ ముక్తార్ కలిశారు. విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మంత్రిని కలిసి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మైనార్టీల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఇందుకు మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారని ఉమర్ పేర్కొన్నారు.



మంత్రి లోకేశ్‌తో ఉమర్ ముక్తార్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నార్పల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగం బేస్‌బాల్ పోటీల్లో హుసేన్ వలి, అండర్-14 విభాగం నెట్‌బాల్ పోటీల్లో సంతోష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు నవంబరు 27తేదీన నంద్యాల జిల్లా అహోబిలం, పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, పీఈటీ నసీమాబేగం, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

టీడీపీని మరింత బలోపేతం చేయాలి

శింగనమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ మండల నూతన కన్వీనర్ గోరంట్లమారుతీ నాయుడుకు ఏడీసీసీబీ చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి అలంనరసానాయుడు సూచించారు. శింగనమలలో బుధవారం వారు ఆయన్ను కలిసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో గ్రామగ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. తర్వాత స్థానిక నాయకులు వారందరినీ శాలువాలతో సన్మానించారు. శింగనమల సొసైటీ అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చితంబరిదొర ,చిదనందనాయుడు, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ప్రిన్సిపాల్ నియామకం హర్షణీయం

అనంతపురంరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్శిటీలోని బీఈడీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించడం హర్షణీయమని ఏఐఎస్‌ఏ జాతీయ కార్యవర్గ సభ్యుడు వేమన అన్నారు. వర్శిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఈడీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్ నియామకంతో విద్యాప్రమాణాలను బలపరచడానికి ముందడుగు పడినట్లయిందన్నారు. ఇదేవిధంగా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కలాశాలల్లో కూడా రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. ఏఐఎస్‌ఏ జిల్లా ఉపాధ్యక్షుడు భీమేష్, యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

జనసేనలోకి పలువురి చేరిక



పార్టీలోకి చేరిన వారితో జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలోకి సుమారు 50 మంది వరకు చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం వారు జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ సమక్షంలో, జిల్లా సహాయ కార్యదర్శి శివ ఆధ్వర్యంల పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీసీ వరుణ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజవర్గ ఇన్‌చార్జులు మణికంఠ, పవన్‌కుమార్, కుమార్, రాజేష్, జిల్లా కార్యదర్శి సురేష్, సహాయకార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ చేరిక..

రామగిరి: మండలంలోని మాదాపురం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ అయిన సంపత్‌కుమార్ వైసీపీని వీడి జనసేనలోకి చేరారు. అనంతపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌సాకే పవన్‌కుమార్‌సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇతనితోపాటు ఐటీవింగ్ శ్యాంసుందర్ కూడా జనసేనలోకి చేరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మేయర్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు: టీడీపీ

అనంతపురం క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని మేయర్ వశీం ప్రాతినిధ్యం వహిస్తున్న 38వ డివిజన్‌లో టీడీపీ నాయకులు గంగారామ్ తదితరులు బుధవారం పర్యటించారు. అక్కడ అధ్వాన స్థితిలో ఉన్న పార్కు పరిశీలించారు. పార్కులో జిమ్ పరికరాలు దుస్థితిలో ఉన్నట్టు గుర్తించారు. తర్వాత మట్లాడుతూ... రూ.2.40 కోట్లతో డివిజన్‌ను అభివృద్ధి చేశామని మేయర్ చెబుతున్నారని, ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలన్నారు. కనీసం డ్రైనేజీ సమస్య కూడా తీర్చలేదన్నారు. ప్రజలకు ఏమీ చేయకుండా ఎమ్మెల్యే దగ్గుపాటిపై విమర్శలు చేస్తున్న ఈ మేయర్‌కు రాబోయే రోజుల్లో డివిజన్ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నాయకులు సుధాకర్ యాదవ్, లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, మోహన్‌కుమార్, దాదు, కేశవనాయుడు తదతరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే ప్రజల్లో సమానత్వం

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్నివర్గాల ప్రజల మధ్య సమానత్వం రాజ్యాంగం వల్లే సాధ్యమైందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బుధవారం 'భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకుందాం, కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఇందులో గేయానంద్ పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు మహిళలకు పురుషులతోపాటు సమానమైన హక్కులుండేవి కాదన్నారు. అయితే రాజ్యాంగం అమలులోకి వచ్చాక వారికి గౌరవప్రదమైన సమానత్వ అవకాశాలు లభించాయన్నారు. ఇదంతా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని అర్థం చేసుకుని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు మాట్లాడుతూ.. జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి జనవరి 26 వరకు రెండు నెలలపాటు రాజ్యాంగంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, అధ్యాపకులు, జేవీవీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

అనంతపురం వైద్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఒకటో తేదీన నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములై, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ విజయలక్ష్మి కోరారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యా సంస్థలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు, విద్యార్థులతో 1న భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారితో అధికారులు సహపంక్తి భోజనం చేస్తారన్నారు. ఎన్‌సీసీ అధికారి సుబేదార్ అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మట్టి మాఫియా

చీకలగురికిలో శ్మశానాన్నీ వదలని వైనం



మట్టిని తరలించడంతో ఏర్పడ్డ భారీ గుంత

విడపనకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్ర మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. రెవెన్యూ, పంచాయతీ అధికారుల అనుమతులు లేకున్నా.. ఎర్ర మట్టిని దర్జాగా పట్టపగలే తరలిస్తున్నారు. దొరికిన కాడికి దోచేస్తున్నారు. చీకలగురికి గ్రామ సమీపంలోని కొంత స్థలంలో శ్మశాన వాటిక ఉంది. శ్మశాన వాటికకు ఆనుకొని చెరువు (నీటి గుంతలు) ఉన్నాయి. శ్మశానాన్ని చెరువుగా చూపించి ఎర్ర మట్టిని తరలిస్తున్నారు. ఉన్న ఆ కొంత శ్మశాన స్థలమూ పోతే.. అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందులుపడాల్సి వస్తుందని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై వీఆర్వో వెంకటేశ్‌ను వివరణ కోరగా తాము ఎవ్వరికి అనుమతులు ఇవ్వలేదని అన్నారు.

రేషన్ షాపులు సీజ్ చేస్తాం

రాయదుర్గం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డీలర్లు రేషన్ దుకాణాలను వేళకు సరిగా తెరిచి ఉంచాలని, లేకుంటే ఆ దుకాణాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ నాగరాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా మంది డీలర్లు సమయపాలన పాటించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై అలాంటి షాపులను గుర్తించి.. అనుమతులు రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ పాల్గొన్నారు.

● ఓటర్ల జాబితాపై సమావేశం

రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితా సవరణలపై బీఎల్ఓలతో తహసీల్దార్ నాగరాజు సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై తగిన సమాచారం ఉండాలని, ఈ అంశాలపై ఎప్పటికపుడు సమాచారం అధికారులకు నివేదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేవాలయాన్ని తెరవాలి

రాయదుర్గం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయాన్ని వివాదాల కారణాలతో మూసి వేయడం తగదని విశ్వహిందూ తాలూకా అధ్యక్షుడు మద్దిలేటి సత్యనారాయణ, కార్యదర్శి మాదుగొండె మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దేవరెడ్డిపల్లి రాజేష్ అన్నారు. ఆ ఆలయాన్ని తెరిపించి.. అమ్మవారికి నిత్య పూజలు అందేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని బుధవారం వారు ఓ ప్రకటనలో కోరారు.

ఇన్‌ఫ్లో 2,590 క్యూసెక్కులు

బెళుగుప్ప, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,590 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 2,590 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం వెల్లడించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.729 టీఎంసీల నీరు ఉందనీ, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,725 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

రేపు వాహనాల వేలం

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్రవాహనాలు, ఒక టాటా సుమోను శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద వేలం వేస్తున్నట్లు సీఐ రవీంద్ర బుధవారం తెలిపారు. ఆధార్, పాన్‌కార్డుతో పాటు రూ.3 వేలు చెల్లించి ఈ వేలం పాటలో పాల్గొనవచ్చునన్నారు.

తహసీల్దార్ కార్యాలయం మార్పు

బెళుగుప్ప, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనానికి మరమ్మతులు చేసి.. అందులోకి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం మార్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంత్‌బాబు, తహసీల్దార్ అనిల్ కుమార్, డీటీ మధుసూదన్‌రావు, ఆర్ఐ నగేష్ పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పూణెకు చెందిన సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ అనే సంస్థ సెప్టెంబరులో వజ్రకరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించింది. చిత్రలేఖనంలో చరిత, రేఖ, హ్యాండ్ రైటింగ్ పోటీలో శాంతిని ఆ సంస్థ ఎంపిక చేసిందని, వీరు త్వరలో పూణెలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం స్వర్ణలత, డ్రాయింగ్ టీచర్ ఓబులేశు బుధవారం తెలిపారు. ఆ విద్యార్థులను అభినందించారు.

చౌడేశ్వరి సేవలో హీరో శ్రీకాంత్



తాడిపత్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యర్రగుంటపల్లిలోని చౌడేశ్వరి అమ్మవారిని సినీ హీరో శ్రీకాంత్.. కుటుంబ సభ్యులతో మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీఏబీఆర్ కాలువలో పెరిగిన కంపచెట్లు

కూడేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువలో కంపచెట్ల, పిచ్చిమొక్కలు జమ్ముగడ్డి భారీగా పెరిగాయి. వాటిని తొలగించకుండా కాలువకు నీటిని విడుదల చేస్తే.. నీటి ప్రవాహం తగ్గి కాలువకు గండ్లు పడే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాలువ కూడా శిథిలావస్థకు చేరుకోవడం నీటి వృథా అధికంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుడికాలువకు నీరు వదిలే సమయంలో మాత్రమే అధికారులు హడావిడిగా పనులు చేస్తున్నారే తప్పా.. అనంతరం వాటి నుంచి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.



కుడి కాలువలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటం

● పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి పనికీ ఓ రేటు
● ఫిర్యాదు చేసినా.. చర్యలు శూన్యం
● అధికారులకు వాటాలే కారణమా..?

పుట్లూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ముగ్గురు ఉపాధి హామీకి సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. వారిలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ తన దైనశైలిలో చేతివాటాన్ని ప్రదర్శిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాడు. నూతన జాబ్‌కార్డులు, మార్పులు చేర్పులు, ఉపాధి కూలీలకు బిల్లుల చెల్లింపు.. ఇలా ఒక్కో దానికి ఓ రేటు నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నాడు. ఫీల్డ్ అసిస్టెంట్లు తమ గ్రామంలోని నూతన జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటే అందరి అనుమతి ఉన్నా ఆయనకు డబ్బులు ఇస్తేనే పని అవుతుంది. గతంలో గ్రామస్థులు అతడిపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా.. చర్యలు శూన్యం. మండలం నుంచి అతను బదిలీ అయినా.. తిరిగి ఇక్కడికే బదిలీ చేయించుకున్నాడు. అతనికి అవినీతిలో అధికారులకూ వాటాలు ఉన్నాయని, అందుకే అతనిపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై ఏపీఓ తులసీప్రసాద్‌ను వివరణ కోరగా.. అతనిపై ప్రస్తుతానికి అలాంటి ఆరోపణలు రాలేదని.. వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయం

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్థానిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● ఉరవకొండ: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సుబ్రహ్మణ్య గాయత్రి, హవనం, పూర్ణాహుతిలను నిర్వహించారు. శ్రీవల్లి, దేవసేన సమేతులైన సుబ్రహ్మణ్యస్వామికి అభిజిత్ లగ్నంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం, ఉయ్యాల సేవను నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక సత్యనారాయణ పేటలోని శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ప్రాకారోత్సవం నిర్వహించారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలోని మల్లాపురం గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కొలువై ఉన్న నవనాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కళ్యాణదుర్గం: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, అలంకరణలో స్వామివారు (ఇన్‌సెట్లో)







ఉరవకొండ : స్వామివారి కల్యాణోత్సవం, గుంతకల్లు: సుబ్రహ్మణ్యస్వామి అలంకరణ, రాయదుర్గం: మల్లాపురంలో నవనాగులకు నిర్వహిస్తున్న పూజ

కుష్ఠు బాధితులను గుర్తించండి

● స్టేట్ శాంపిల్ సర్వే అధికారి డాక్టర్ ఉషారాణి



కొట్టాలపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ఉషారాణి

విడపనకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వే ద్వారా కుష్ఠు బాధితులను గుర్తించాలని స్టేట్ శాంపిల్ సర్వే అధికారి డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. సర్వేలో భాగంగా మండలంలోని పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈమె మాట్లాడుతూ గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తున్న సమయంలో కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుష్ఠు అతి సాధారణ వ్యాధి అని, ఆరు నెలలు లేదా ఒక సంవత్సరం పాటు మల్టీ డ్రగ్ థెరపీ మందులు వాడితే నయం అవుతుందని తెలపాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ చేయాలన్నారు. రాగి రంగు మచ్చలు లేదా నరాలలో అనుమానపు లక్షణాలు ఉంటే వారిని గుర్తించి వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపాలన్నారు. అక్కడ పరీక్షలు అనంతరం కుష్ఠుగా నిర్ధారణ అయితే వెంటనే ఎండీటీ చికిత్సను అందివ్వాలన్నారు. వారి కుంటుంబలోని కుటుంబ సభ్యులకు సింగిల్ డోస్ రిఫార్మ్సిన్ చికిత్సలు అందివ్వాలన్నారు. అనంతరం ఇంటింటి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి వైద్యులు పుష్పా, మస్రద్‌జాహ, జయకుమార్ నాయక్, మనోజ్, గంగాధర్ రెడ్డి, పీఎంఓ నాగన్న, తిరుపాల్ నాయక్, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రూపానాయక్ తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం బంజారా నాయకుడు కేశవ నాయక్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తులసీదాస్ నాయక్, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం నాయక్, గోపాల్ నాయక్, మంగానాయక్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

పంటలకు మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఓబులు

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం 2021 డిసెంబర్‌లో ఇచ్చిన జీవో ప్రకారం పంటల మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు ఆందోళన నిర్వహించారు. ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్, పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాలు.. తదితర వాటితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, ఎరువులపై కోత విధించిన రూ.87వేల కోట్ల సబ్సిడీని పునరుద్ధరించాలని, బ్లాక్ మార్కెట్‌ను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పదో రోజుకు చేరిన దీక్షలు



దీక్షలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్ష బుధవారానికి పదో రోజుకు చేరింది. ఈ దీక్షకు మున్సిపాల్టీ పారిశుధ్య కార్మికుల యూనియన్ సంఘీభావం తెలిపింది. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సీఐటీయూ తాలూకా అధ్యక్షుడు రంగనాథ్, జిల్లా కోశాధికారి హెచ్ వన్నూరుస్వామి, తిప్పేస్వామి, లోకేష్, గంగాధర పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యపరీక్షలు

రాయదుర్గం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు స్థానిక పెన్షనర్ల భవన్‌లో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. 72 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా... నలుగురికి గుండె, ఇరువురికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామాంజినేయులు, నారాయణరెడ్డి, ముత్యాలరెడ్డి, బారీసాబ్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల గుత్తికోట సందర్శన

గుత్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ గురుకుల కళాశాల విద్యార్థులు బుధవారం గుత్తి కోటను సందర్శించారు. నాటి దత్తత కలెక్టర్ సర్ మన్రోథామస్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఇందులో ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, సిబ్బంది, గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, గైడ్ రమేష్ పాల్గొన్నారు.



మన్రో సమాధి వద్ద గురుకుల విద్యార్థులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: నియోజకవర్గ, మండల కేంద్రాల్లో 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగం పరిరక్షణకు ఉద్యోగులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. పలు పాఠశాలల్లో రాజ్యాంగంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి.. విజేత విద్యార్థులకు బహుమతులు అందించారు. కళ్యాణదుర్గంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విడపనకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ప్రముఖుల వేషధారణతో ఆకట్టుకున్నారు.



కళ్యాణదుర్గం : మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు



విడపనకల్లు : జడ్పీ ఉన్నత పాఠశాలలో చిన్నారుల వేషధారణ

క్రైం న్యూస్..

వృద్ధురాలి మృతి

బెళుగుప్ప, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లికి చెందిన సుంకమ్మ (74) చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. గత సెప్టెంబరు 12న స్వగ్రామం నుంచి ఆర్టీసీ బస్సులో బెళుగుప్పకు వస్తుండగా... గ్రామ శివార్లలో ఆ బస్సు ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ప్రమాదంలో సుంకమ్మ గాయపడింది. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మరణించింది. ఆమె కుమార్తె అనురాధ ఆర్టీసీ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బుగ్గకు చెందిన సత్యరాజు, అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

బైక్ నుంచి పడి మహిళకు...

గుత్తిరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పామిడికి చెందిన నాగార్జున, శ్రావణి దంపతులు గుంతకల్లు నుంచి బైక్‌లో స్వగ్రామానికి బుధవారం బయలుదేరారు. మండలంలోని శ్రీపురం గ్రామాశివారులోకి రాగానే బైక్‌లో నుంచి శ్రావణి కింద పడడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు ఢీకొని వ్యక్తికి..

గుత్తిరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామాశివారులోని బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వన్నేదొడ్డి గ్రామానికి చెందిన నరసింహులు గాయపడ్డాడు. అతను గుత్తి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. కారు ఢీకొనడంతో కిందపడ్డాడు. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో రైతుకు..

శెట్టూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై కుందుర్పి మండల పరిధిలోని యర్రగుంట గ్రామానికి చెందిన రైతు నిజవల్లి రామాంజినేయులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామాంజినేయులు తన పొలానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని సంబంధిత లైన్‌మన్‌కు తెలియజేసి ఎల్‌సీ తీసుకుని సోమవారం విద్యుత్ స్తంభం ఎక్కాడు. కనుకూరు ఫీడర్‌కు చెందిన లైన్‌మన్ రామచంద్ర, ఇద్దరు రైతులకు ఒకేసారి ఎల్‌సీలు ఇచ్చాడు. ఒక రైతుకు సంబంధించిన ఎల్‌సీని ట్రాన్స్‌కో కార్యాలయం తెలియజేసి రిటర్న్ చేశారు. మరో ఎల్‌సీ మరిచిపోయి.. విద్యుత్‌ను సరఫరా చేశారు. దీంతో విద్యుదాఘాతానికి గురై రామాంజినేయులు స్తంభంపై నుంచి కిందపడ్డాడు. వెన్నెముకకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై శెట్టూరు ఇన్‌చార్జ్ ఏఈ భరత్ వివరణ కోరగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్ట్రాటెక్ సమీపంలో బుగ్గవద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కాటమయ్య తెలిపారు. వారి నుంచి రూ.12,500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం విక్రేత..

పెద్దవడుగూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అతని వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చెలరేగిన కేబుల్ దొంగలు

యాడికి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మాజీపేట గ్రామం వద్ద మంగళవారం రాత్రి కేబుల్ దొంగలు చెలరేగిపోయారు. ఐదుగురు రైతుల వ్యవసాయ బోరుబావుల వైర్లను ఎత్తుకెళ్లారు. రైతు వెంకటసుబ్బయ్యకు చెందిన 40 మీటర్లు, హుసన్‌వలికి చెందిన 60 మీటర్లు, చరణ్‌కు చెందిన 120 మీటర్లు, సంజప్పకు చెందిన 100 మీటర్లు, సుబ్బయ్యకు చెందిన 100 మీటర్ల కేబుల్ చోరీకి గురైంది. కేబుల్ దొంగల ఆగడాలను అరికట్టేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మొక్కల పెరికివేత

కళ్యాణదుర్గం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తన ఎకరా పొలంలో సాగు చేసిన అలసంద మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు పెరికివేశాని మండలంలోని కుర్లపల్లికు చెందిన రైతు నాగరాజు బుధవారం వాపోయాడు. 15 రోజుల క్రితం రూ.80 వేలు ఖర్చు చేసి అలసంద మొక్కలు సాగు చేశానన్నారు. తోటలో ఎవరూలేని సమయంలో ఆ మొక్కులను దుండగులు తొలగించారన్నారు. దీనిపై కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

ఎరువుల విక్రయం నిలుపుదల

కణేకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ప్రత్యేక స్క్వాడ్ ఏడీఏ సత్యనారాయణ బుధవారం తనిఖీ చేశారు. వివిధ దుకాణాలలో తేడాలు ఉండడంతో 30.69 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయాన్ని నిలుపుదల చేశామని, వీటి విలువ దాదాపు రూ. 6.59 లక్షలు ఉంటుందని ఏడీఏ తెలిపారు. అలాగే రూ. 2.49 లక్షల విలువైన ఎరువులను కూడా జప్తుచేసి 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ఆయన వెంట ఏఓ జగదీష్ ఉన్నారు.

కొట్టాలలో రైతన్నా.. మీ కోసం..!



ఎన్ కొట్టాలలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ కొట్టాలలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందులో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, తలారి మస్తానప్ప, సంజీవరాయుడు, అల్లు శీన, రామన్న చౌదరి, యుగంధర్, నరేంద్రనాయుడు పాల్గొన్నారు.

● కూడేరు : ముద్దలాపురం గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ నిర్వహించారు. ఇందులో ఏఓ శుభకర్, టీడీపీ నాయకుడు మురళీ, రైతులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు ఉమాగౌడ్, హనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు.

● గుంతకల్లుటౌన్: సీఐటీయూ నాయకులు బీ శ్రీనివాసులు, సాకే నాగరాజు, కే నరసయ్య, జగదీష్, రంగనాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు.